

ఈసారి ఢిల్లీ కేంపు తప్పించుకునే సరికి తాతలు దిగొచ్చేరు శారదకు. 'దాస్ అండ్ దాస్' కంపెనీని సంవత్సరం నుండీ మీరే డీల్ చేస్తున్నారుకదా ... ఈసారీ మీరేవెళ్ళి ఈ కంసైన్‌మెంటు ఫిక్స్ చేసుకువస్తే బాగుంటుందని బాస్ ఒకట్రెపెస్ చేయటం, కాదనటానికి మొదట కాస్త మొగమాటంపడినా ఏమైతే అయిందని 'సారీసర్, రాకరాక మా ఫ్రెండు వస్తోంది శ్రీనగర్‌నుండి ... నేను లేకపోతే చాలా బాధపడుతుంది' అని అబద్ధం ఆడేసింది; చివరకు మిస్టర్ మూర్తిని పంపటాన్కి నిశ్చయించేరు. 'ఈ కేంపులు తప్పించుకోవటం ఒకగొడవ .. ఆతరువాత ఏవేవో పిచ్చిపిచ్చి ఆలోచనలు. ఎన్నిసార్లు యిలా బాస్‌ను మభ్యపెట్టగలుగుతుంది? ఇక ఈ ఢిల్లీ వ్యవహారాలు వద్దు... సౌత్ జోన్‌ను అడుగుతేసరి. మొదట్లో స్వయంగా కావాలని నార్త్‌జోన్ నెంచుకుని యిపుడు వద్దంటే ఏం బావుంటుంది. అయినా రంజనను తప్పించుకోవటాన్కి తానెందుకు ఇన్నిపాట్లు పడాలి ... అసలు తప్పించుకు తిరిగే అవసరం తనకేంవుంది?' రంజన గుర్తుకు వచ్చేసర్కి శారద మనసు అదోలా అయిపోయింది ఫైల్సన్నీ అప్పగించి, ఆ కంపెనీ వ్యవహారాల గురించి మూర్తిగార్కి క్లుప్తంగా వివరించి యిల్లు చేరుకునేసరికి తలదిమ్ము ఆరంభం అయింది. షవర్‌బాత్‌తో కాస్త కుదుటబడి లెటర్‌బాక్స్ తెరిచింది. రెండుకవర్లు వచ్చేయి. ఒకటి ఢిల్లీలోని ఏదో ప్రైవేట్ ఫర్మ్‌నుండి లెయిజన్ ఆఫీసరు ఉద్యోగాన్కి ఆఫరు. 'యిదే ఆరునెలల్ క్రితం అయుంటే ఎగిరిగంతేసి వప్పుకునుండేది.' రెండోకవరు తమ్ముడు రాజు దగ్గరనుండి. 'ఏమిటో విశేషం... బరువుగావుంది కవరు' కుతూహలంగా చదవటం మొదలుపెట్టిన శారద మొహం ఉత్తరం పూర్తయ్యేసరికి పాలిపోయింది 'ఏమయింది వీడికి యిలా రాసేడు?' మెదడు మొద్దుబారి తానేం చదివిందో ఒకంతట అర్థంకాలేదు. కాని రెండోసారి చదవటానికీ మనసు వప్పలేదు. కలలోకూడా ఊహించని చేదు నిజం కళ్ళముందు సాక్షాత్కరించింది. 'కాస్త బాధ్యతగా వుండు' అని క్రితంసారి కొంచెం

ఘాటుగా రాసిన ఉత్తరానికి తాను ఆశించని జవాబుయిది... 'దీనిక్కారణం ఏమిటి? వాడురాసిందంతా నిజమేనా? తానేమైనా వాళ్లపట్ల అతిగా ప్రవర్తించిందా? తను కాదనుకున్నా వాడి దృష్టిలో తానేమో?' శారద కళ్లముందు ఉత్తరంలోని వాక్యాలు పదేపదే మెదలసాగేయి. 'నేను ఇలా తయారవటాన్కి కారణం నువ్వు, నువ్వు చెలాయించిన పెత్తనం... అధికారం. నా యిష్టప్రకారం ఒక్కటైనా జరిగిందీ యింట్లో'... సరైనగ్గా దెబ్బ యివ్వాలని వాడి విషయాల్లో తను సలహాలిచ్చినందుకు యిదీ కాంప్లిమెంటు... 'మీకోసమేగదరా నాన్నగారూ నేనూ పాట్లుపడేది' అంటూ అనునయంగా తాను రాసిందాన్కి సమాధానం 'మాకోసమే నువ్వు ఉద్యోగం చెయ్యనక్కరలేదు. తలిదండ్రుల్ని పోషించుకునే శక్తి ప్రతి మగవాడికీ దేవుడిచ్చేడు.' శారద మనసు పరిపరివిధాల పోతూంది... 'మేం ...నువ్వు' 'వాళ్లకి తను పరాయిదా?' తమ్ముడిగా నీకు నేనురాసే ఆఖరి వుత్తరం యిదే ...ఈ ఫలితంకోసమేనా తనిన్నాళ్లూ వ్రతీఅయి తాపత్రయ పడింది? 'తనకు ఆదర్శాలు అంటూలేవు. అసలవంటేనే చికాకు. యింకా నయం అందరిమాటలూ నిజం అనుకుని తనేదో ఆదర్శం వెలగబెడుతున్నానని, త్యాగం చేస్తున్నానని... కనుక దానికి గుర్తింపు, కృతజ్ఞత వుండాలని అనుకుందికాదు. లేకపోతే రాజుగాడి ఉత్తరాన్ని... నిందనూ యింత సహజంగా, నిర్లిప్తంగా తీసుకునుండగలిగేదా?' తన సహృదయతనూ, త్యాగాన్ని ఉపయోగించుకుని చివరకు మోసం చేసారని వాపోయే ఒక కథానాయిక డైలాగులు గుర్తువచ్చి అప్రయత్నంగానే నవ్వేసింది శారద. "ఏమిటండోయ్ శుభవార్త ... అంతలా నవ్వేసుకుంటున్నారు' అంటూ లోపలికి వచ్చిన లలితను చూసి 'అబ్బే ఏంలేదు... మాతమ్ముడేదో జోక్‌వేస్తేను' అంటూ ఉత్తరం డ్రాయరులో పడేసింది. ఆవిడగారు కబుర్లు ముగించి కదిలేసర్కి 7 గంట లయిపోయింది. వంట చేసుకోవటానికి బద్ధకంవేసి బ్రెడ్డుతో భోజనం అయిందనిపించి పెర్రిమేసన్ నవల చదువుతూ కూర్చుంటే 9 గం అయిపోయింది బైట చల్లగా గాలివేస్తుంది.

మొదట్నించీ తనకు ప్రకృతి అందాల్ని చూస్తూ గడిపేయటం అంటే చాలా యిష్టం. ఇక్కడకు వచ్చిన కొత్తలో ఆరుబయట కుర్చీ వేసు క్కూర్చోవటాన్కి సంకోచించినా బైట వాతావరణం సంకోచాన్ని రెండు రోజులకే జయించేసింది. ఈ యింటి కాంపౌండు గోడలు మరీ పొట్టిగా వున్నాయని మొదట్లో విసుక్కుంది కూడాను. రాత్రి 10—30 వరకు మబ్బుల్ని చూస్తూ, నక్షత్రాల్ని లెక్కబెడుతూ కూర్చునే తన్ని చూసి మొదట్లో యింటిగలవాళ్లూ, ఎదురింటివాళ్లు కాస్త యిబ్బందిగా ఫీలయినా, రాను రానూ వాళ్లూ అలవాటుపడిపోయేరు.

కాస్తసేపు రిలాక్స్ అయేసరికి సాయంకాలం ఉత్తరం మళ్ళీ శారద కళ్ల ముందు మెదిలింది. 'నిన్న మొన్నటివరకూ నాన్నగారికీ నాకూ అమ్మ ద్వారా శిఫారసులు పంపించే వీడు తన సమస్యల్ని స్వయంగా ఆలోచిస్తున్నాడన్న మాట. ఫరవాలేదు... తన భవిష్యత్తు తానే నిర్ణయించుకోగలడు' ...అంతలోనే ఉత్తరం సారాంశం గుర్తుకువచ్చి మనసు కలుక్కుమంది. 'తనూ మారిపోతూంది. ఊఁ అంటే విసుక్కునే తనకు ఇలాంటి ఉత్తరం చదివినా కోపం రావటంలేదు బహుశ అందులో ఎంతో కొంత నిజం లేకపోలేదని అంతరాత్మ చెప్తూందేమో? అయినా తనది మాత్రం తప్పేం వుందని? తప్పంటూ వుంటే... తాను ఆడపిల్లననీ, సమాన హక్కులు సాధించిన ఈ యుగంలో కూడా సమాన బాధ్యతలు మాత్రం యింకా దూరంగానే వున్నాయనీ...ఆడపిల్ల పరాయిదన్న భావం మన నరాల్లోంచి, సంస్కారాల్లోంచి యింకా తొలిగిపోలేదని మర్చిపోవటమే. ఈ మాట కొస్తే ఈ తప్పు అమ్మా, నాన్నగారిదేనేమో? కొడుకులూ, కూతుళ్లన్న బేధమే లేదు వాళ్లకెప్పుడూ. ఆ వాతావరణంలో పెరిగిన తనూ తన తోబుట్టువులనందర్నీ ఎప్పటికీ తనవారుగానే భావించింది. బహుశ ఆప్యాయతను అందించి, వాళ్ళ శ్రేయస్సును కాంక్షించటం తప్ప... స్వయంగా అధికారం చెలాయించి వాళ్ళను నడిపించే హక్కు ఆడపిల్ల కనుక తనకు లేదేమో? కాని ఈ సత్యం ఈ రోజు సాయంకాలం వరకు తను గుర్తించలేకపోయింది. అందుకే పనుల హడావిడిలో నాన్నగార్కి వీలుండదని బాధ్యత తను స్వయంగా మీద వేసుకుని ఓనమాల నుండి గ్రేడ్యుయేషనువరకు తమ్ముళ్ల చెల్లాయిల చదువు మీద పెత్తనం చెలాయిస్తూ వచ్చింది. తన ఫ్రెండు చెల్లెలు అన్నింట్లోనూ రేంకులు సంపాదిస్తుంటే వీళ్లూ అలాగే ఫస్టు రావాలని చదివించబోయి... మొండికేసి చదవకపోతే ఉక్రోషం, కోపం, ఉడుకుమోత్తనం పట్టలేక వాళ్లను బాదేసి తనూ ఏడ్చేసేది.' చిన్నప్పటి సంఘటనలు శారద కళ్లముందు తిరగసాగేయి. 'అపుడు తను సెకెండు ఫారంలో వుంది కాబోలు దసరాశలవుల్కి తాతగారింటికి వెళ్లటం అంటే తానూ, రాజూ రెండో లఘు వేసేవారు. వీధిబడిపిల్లలతోబాటు బాణాల్కు పూలు పట్టుకుని దసరాపాటలు పాడకుంటూ యింటింటికీ తిరగటం అదో థ్రిల్లింగ్‌గా వుండేది. 'కోనేటివైపు మాత్రం వెళ్లనీయకండి' అని పదేపదే జాగ్రత్తలు చెప్తూ ఇద్దర్నీ మామయ్య వెంట పంపేవారు. అమ్మమ్మదగ్గర తమదే యిష్టారాజ్యం. ఎవరెంత చెప్పినా వినకుండా స్నానాలకంటూ ప్రతిరోజూ చెరువుకు రెడీ అయేవారు పిల్లలంతా. అమ్మమాటలు గుర్తుకువచ్చి తానుండి పోతేనైనా రాజుగాడు మానేస్తాడేమోనని యింటిదగ్గరే వుండిపోయేది. అయినా వాడుమాత్రం రెడీ అయిపోయేవాడు. వాళ్లు చెరువునుండి తిరిగి వచ్చేవర్కు పిచ్చిపిచ్చి భయాలతో బితుకు బితుకు మంటూ కూర్చునేది. ఒకరోజు అందరూ తిరిగి వచ్చేసినా వాడు మాత్రం రాలేదు. ఆతృతని, భయాన్ని బైటపెడితే అందరూ వెక్కిరిస్తారని భయం.. మొగమాటం, అలాగే ఎదురు చూస్తూంది ఎంతకీ వాడు రాకపోయేసర్కి ఇక వుండ బట్టలేక పక్కింటి శీనును రహస్యంగా పిల్చుకుని రాజును వెదకటాన్కి బైలుదేరింది. కోనేరు, బడి, శివాలయం, ఆంజనేయులు గుడి, ఆఖర్కి అగ్రహారం త్రోవలుకూడా వెదికేసి ఏడుపాపుకుంటూ యింటికి వచ్చేసర్కి ఎదురుగా వాడు ప్రత్యక్షం ... బటాసీలు నవుల్తూ. ఆ ఊపునవెళ్లి ఒక్క లెంపకాయ వేసేసరికి 'కేరుమన్నాడు'..వాడి ఏడుపువిని బైటకువచ్చి వాడితోబాటు

ఏడుస్తున్న నన్నుచూసి అమ్మమ్మ తికమక పడుతూంటే చల్లగా చెప్పేడు మామయ్య...' ఊరికినే దీన్ని ఏడిపించటాన్కి మన రాజాని సుబ్బన్నగారింట్లో దాచేసాం...వాడికోసం ఊరంతా వెతికి వచ్చింది.' 'ఏయ్...మీ తమ్ముడ్ని ఎలకెత్తుకు పోయిందంటూ వాళ్ళు వెక్కిరిస్తూంటే ఉడికిపోయి కర్రతీసుకుని వెంట బెట్టింది. ఎందుకో చిన్నప్పటినుంచీ ఒక ఇగో...ఒకరకం అయిన 'అహం' పేరుకు పోయింది తనలో. తన మమతలూ...అనురాగాలు, కష్టాలూ సమస్యలు అన్నీ తనలోనే యిమిడ్చేసుకునేది.. బయటకు వ్యక్తం చేయటం అంటే ఇప్పటికీ తనకు కొంత చిన్నతనంగానే వుంటుంది. ఆరోజు సంఘటన తల్చుకుని యిప్పటికీ మావయ్య వెక్కిరిస్తుంటాడు. శలవులయి యింటికి వచ్చే సెక రోజూ ఒకేకల. 'పెద్దచెరువు...దాని గట్టుమీద రాజాగాడూ తనూ ఆడుకోవటం...హఠాత్తుగా నాడందులోకి దూకేయటం...ఆ వెంటనే పక్షి ఒకటి బైటకు రావటం— దాన్ని మళ్ళీ ఎవరైనా రాజాగాడిగా మార్చగలరేమోనని తను అడవులూ ...మైదానాలు ... కొండలూ ఓ... ఒకే యిదిగా తిరిగేయటం' ఆ రోజుల్లో ఠంచనుగా రోజూ ఈ కల వస్తుండేది. నిజానికి రాత్రిపూట నిద్రపోవాలంటేనే భయం వేసేది తనకు. ఇప్పుడనిపిస్తుంది...ఆ రోజు మావయ్యావాళ్ళూ చేసిన ప్రాక్టికల్ జోకు, టూరింగ్‌హాలులో చూసిన అరవ సినిమా ఎంతగాఢంగా మనసులో ముద్ర వేసాయోనని.'

హఠాత్తుగా చినుకులు పడటంతో గిరద ఆలోచనలకు బ్రేకుపడింది. 'అబ్బ! ఇప్పుడే వదిన్నరయిందే.' వర్షం జోరు హెచ్చయింది. ఫిల్టర్ డికాక్షన్‌తో స్ట్రాంగ్ కాఫీ ప్రిపేర్ చేసుకుని పరధ్యాన్నంగా సిప్ చేస్తున్న గిరిద మనసు మళ్ళా వెనక్కు పరుగెట్టటం మొదలుపెట్టింది. 'ఇలాంటి వెదర్‌లో ఎప్పుడూ రంజన గుర్తొస్తుంది. పిచ్చిపిల్ల...ఎలావుందో?... హాస్టల్లో వున్నపుడు చినుకులుపడితే చాలు ఓటికీమాటికీ ఏదోవంకతో వర్షంలో తడిసి సంబరపడిపోయేది వంటికి మంచిదికాదని తాను దెబ్బలాడితే... అంతక్రితం వర్షంలో తడిసి హైఫీవర్‌తో నేను మంచం ఎక్కిన

# మైక్రోస్కోప్

సంగతి గుర్తుకుతెస్తూ 'మేం... తమలాగా నాజూకు మనుష్యులంకాదు మేడం' అంటూ వెక్కిరించేది. అసలు ఆ జ్వరమేకదా తామిద్దరినీ యింతదగ్గర చేసింది. ఎదురుపడితే 'హలో'అని తప్పుకునే రంజన ఆ వారంరోజులూ తన్నంటిపెట్టుకుని తనకు సాయంచేస్తూ ఫీవర్ తగ్గి నార్మల్‌కు వచ్చేవరకూ వర్రీ అయిపోతుంటే ఆశ్చర్యపోయింది తను. రంజన ప్రతికదలిక, ప్రతి చూపు, ప్రతి మాటలోనూ, వర్షించిన ఆప్యాయత, అనురాగం, మమత ఓహ్ ... అది తనకో కొత్త అనుభవం. అమ్మలోని ఆప్యాయత, నాన్నగారి వాత్సల్యానికి రూపం యిస్తే యిలాగే వుంటుందేమో అనిపించింది. వాళ్ళ గుండెలనిండా అనురాగం, మమతలూ నిండివున్నాయని తనకు తెలిసినా ... వాటి వెల్లువ ఉప్పెన ఎలా వుంటుందో ఎప్పుడూ అనుభవించలేదు తాను. యదార్థ జీవితంలోని కటుత్వం, పరిస్థితుల సంఘర్షణ, బాధ్యతల గ్రహింపు తమ భావుకతను లోలోపలే అణచేసాయేమో ననిపిస్తుంది అమ్మ, నాన్నగారు కూతురికంటె ఒకమెట్టు పైస్థాయినిచ్చి తమ సమానస్థాయిలో నిలబెట్టేరు. అందుకే ఆ మెట్టు దిగి సహజంగా ప్రవర్తించలేక పోయింది తను. అందుకేనేమో రంజన పరిచయం తన

## పసిపాప మనసు

తెలుగువోలె చాల తియ్యన, వెన్నెల
వోలె తెల్లన, చిరుగాలి వోలె
చల్లన, పుష్పవోలె చాలమెత్తన, ఎట్టు
పాప మెరుగని పసిపాప మనసు.

అంతలోనె నవ్వు, అంతలో ఏడుపు,
మూగనోము పట్టు, ముద్దులొలుకు
పలుకు మాటలాడు, అంతుపట్టదుగదా
పసిడి ముద్దవంటి పాపమనసు.

ఎంతకోపమైన కొంతసేపె, పిదప
నవ్వుదోడుగు సంగనాచి వోలె
కలసిమెలసి యాడు కపటమ్ములేకుండ
పరమచిత్రముగద పాప మనసు!

—చల్లా రాధాకృష్ణశర్మ

జీవితానికి అమూల్యవరం అయింది. 'చుట్టూ గిరిగీసుక్కూర్చుంటావు... నిన్నర్థం చేసుకోవటం ఆ బ్రహ్మతరం కాదు బాబూ' అంటూ విసిగిపోయేది తన ఫ్రెండు రమ. కాని ఆ గిరి లోపలికి అనుకోకుండానే స్వయంగా ఆహ్వానించింది రంజనను. తనకున్న బలహీనతలతో సహజంగా వ్యక్తం అయింది రంజనముందు మాత్రమే. అన్ని అనుభూతులూ, అన్ని బంధాలు రంజన రూపంలోనే తనకు దొరికేయా అనిపించేది. 'జీవితం అంటే యిది' అనిపించిన రోజులవి. విడుపు కలయికలు సహజం అని నిర్లిప్తంగా భావించే తను రంజనకు వీడ్కోలిస్తున్నపుడు మనసును కంట్రోలు చేసుకోలేక పోయింది. ఆ శలవుల్లోనే రంజన మేరేజి అయిపోయింది. రంజన భర్త రమేష్ ఢిల్లీలోనే ఏదో ఫర్మలో రిసెర్చి ఆఫీసరు. రంజన సంసారం గొడవలో పడితే తను అసిస్టెంటు పబ్లిక్ రిలేషన్సు ఆఫీసరుగా మద్రాసు చేరుకుంది. ఆఫీసు పనిమీద ఢిల్లీ వెళ్ళినపుడల్లా రంజనని చూసి వస్తుండేది. రమేష్ ఎంతో ప్రాణంలా చూసుకుంటాడని గ్రహించి మురిసిపోయింది. క్రొత్త వాతావరణం, ఉద్యోగం, బాధ్యతలు ... వీటితో సతమతం అయ్యే తనకు రంజన ఉత్తరాలు ఎంతో రిలీఫ్ నిస్తుండేవి. 'రంజన నాకుంది' అన్న భావనే తనకు వెయ్యేనుగుల బలాన్నిచ్చేది. ఈ బలంతో తను కళ్ళుమూసుకుని కూడా సునాయాసంగా నడిచిపోగలదు. జీవితంలో బహుశ ఈ నమ్మకం, మనోబలం వల్లేనేమో అప్పట్లో తనకు అంతా చాలా ఈజీగాను. ఎలాంటి సమస్యైనా ఎంతో తేలిగ్గానూ అనిపించేది బహుశ మనసు సున్నితం అయిన భావాలూ... బంధాలతో నిండి బరువైనపుడు జీవితం తేలిగ్గానూ ...అది ఖాళీ అయినపుడు జీవితం బరువుగానూ అనిపిస్తుందేమో.

క్రితం మార్చిలో ఒక కాన్ఫరెన్సు ఎటెండవటాన్కి ఢిల్లీ వెళ్ళినపుడు రంజన బలవంతంమీద వారంరోజులు శలవు పెట్టి తనదగ్గర వుండక తప్పలేదు. ఎంతో ఆరిందాలా యింటిపనులు చక్కబెడుతూ సతమతం అవుతూన్న రంజనను ఏడిపిస్తూ తమాషాగా, హాయిగా ఆ వారం

## మైక్రోస్కోప్

రోజులూ గడిచిపోయింది. రంజని ఆప్యాయత అనురాగాలు రెట్టింపయే యనిపించింది. ల్లలతో కలిసి అప్పుడప్పుడు షాపింగులకు వస్తున్నా సాధ్యం అయినంతవరకు తప్పించుకు తిరిగేవాడు రమేష్. రంజన నాతో మనసిచ్చి మాట్లాడుతూ మురిసిపోతున్నా, నవ్వు తమాషా వట్టించి నవ్విస్తున్నా రమేష్ కళ్ళల్లో లీలగా కదలాడే అసహనం ...అసూయని తాను గమనించకపోలేదు. ఆ వారం రోజుల్లోనూ ఒకే ఒరలో రెండు కత్తులిమడవన్న సత్యం తనకు అర్థం అయింది. అగ్నినీ, పెద్దలనూ సాక్షిగా పెట్టి జీవితాంతం తనువూ మనసు సంపూర్ణంగా తనది కావాలనుకుని భార్య మెడలో తాళి కట్టిన పురుషుడు ఆమె తన అనురాగాన్ని మరొకరికి పంచితే సహించలేడేమో. అసూయా అసహనాల జ్వాలలు రంజన సున్నిత హృదయాన్ని కాల్చేయవు గదా! దారాలు ఎక్కువైతే చిక్కులు పడక తప్పదేమో. యిటు తనని దూరం చేసుకోలేక, అటు రమేష్‌ను సమాధానపర్చలేక రంజన సతమతమౌతే... ఛీ... తన రంజనకు తనే సమస్యగా తయారవటమా! రమేష్‌తో రాజుకున్న ఈ నిప్పును ఎంత త్వరగా ఆర్పగలిగితే అంత మంచిది. అదీ రంజన గ్రహించేలోగానే, ఆ వేడి రంజనకి తగలక ముందే జరగాలి. అందుకే కావాలని తాను దూరం కావటం మొదలుపెట్టింది. ఉత్తరాలకు తనిస్తున్న ముక్తసరి జవాబులు చూసి ఎంత బాధ పడుతుందో పాపం... అయినా తప్పదు. ఈ క్రొత్త పరిస్థితిలో యిమడటాన్కి ఆరు నెలలు పట్టింది తనకు. 'ఇంకో మూడు నెలల్లో నీకో మేనల్లుడు అవతరించబోతున్నాడని వారం రోజుల క్రితం రంజన రాసిన ఉత్తరం గుర్తుకొచ్చింది శారదకు. 'ఈ సమయంలో స్త్రీలు క్రొత్త అందాలతో మెరిసిపోతా రంటారు. ఈ క్షణం రంజన ముందు రెక్కలు కట్టుకు వాలాలనుంది. అయినా మనసు కట్టుకోక తప్పదు.'

........'తనకు ఇన్నాళ్ళూ హుషారిన్నీ ఇచ్చే బంధాలు ఒక్కొక్కటే తెగిపోతున్నాయా?' ఊహా మాత్రంగానైనా అనుకోవటాన్కి శారద మనసు ఒప్పలేదు ...అది అబద్ధం అన్న నమ్మకంవల్ల కాదు ...నిజమేమోనన్న భయంవల్ల హఠాత్తుగా వచ్చిన ఈ ఆలోచనతో ఏదో బెంగగా అనిపించసాగింది. 'పోనీ క్రొత్త బంధాల్ని సృష్టించుకుంటే' తన ఆలోచన తనకే హాస్యాస్పదంగ వుంది బహుశ తను ఆ స్టేజ్ దాటిపోయిందేమో మనిషిని చూస్తూనే మనసును కనిపెట్టి ... ప్రతి మాటనూ, ప్రతి కదలికనూ నిశితంగా పరిశీలించగలిగే తను యిక ఎవ్వర్నీ ప్రాణ స్నేహితులుగా భావించలేదేమో? ఒకసారి ఆ అనురాగ స్రవంతిలో మునిగి నిజం అయిన స్నేహాన్ని రుచి చూసిన తాను యిపుడు ఎవరితోనూ మనసిచ్చి మాట్లాడలేదు. అందుకే ఇక్కడ అందరూ పరిచయస్థులుగానే మిగిలిపోయేరు. రంజన స్నేహం ముందు కొత్త స్నేహాలు పర్వతం ముందు మరుగుజ్జుల్లా అనిపిస్తాయి. 'నిర్మల మందాకినీ వీచికల తూగు రాయంచ చనునె తరంగిణులకు'... ఎంత చక్కగా చెప్పేడు భాగవత కారుడు.' శారద ఆలోచనలు సాహిత్యం ... ఈనాటి కథల మీదకు మళ్ళేయి 'ఒకరి కర్పించిన హృదయంలో వేరొకరికి చోటు ఎలా యివ్వను నాన్నా' ఎంతో ఎమోషనల్‌గా పాత్రలచేత డైలాగుల్ని పలికించే నేటి కథా రచయితలు ఏకనిష్ఠతను ప్రేమవరకే ఎందుకు పరిమితం చేసినట్లు? తనకే గనుక కథలు రాసే ఫ్రెండుంటేనా ... చెవులు మెలేసి స్నేహితుల డైలాగులు కూడా రాయించు డేది...ఇంతకీ డైలాగు లెలా వుండాలటా... 'రంజా! నీ స్నేహం నా జీవితాన్కి వెలుగు... నువ్వే నా జీవిత నౌకకు కర్ణధారిణివి' అని స్త్రీ పాత్రల చేతా, 'డియర్ మై రాజా! యువార్ మై బెస్ట్ ఫ్రెండ్ అండ్ యు ఆర్ మై లాస్ట్ ఫ్రెండ్' అని పురుష పాత్రల చేత అనిపిస్తే బ్రహ్మాండంగా వుంటుంది. రైమ్ కూడా కుదిరింది. పోనీ...తనే రాసేస్తే... బాబోయ్... ఈ విమర్శక మహాశయులూరు కుంటారూ? ఏవో కాంప్లెక్సు, కాంప్లికేషన్సు, చేతనం అవచేతనం అంటూ సైకాలజీ సూత్రాలు వల్లెవేసి విపరీతార్థాలు తీసి ఈ బంధాన్ని అవహేళనచేస్తే తాను భరించగలదా?' పక్కింటి గడియారం గంటలకు తుళ్ళిపడింది శారద. 'అరె... అపుడే 12 అయిపోయిందే... యింకాసేపు గాని లైటుంటే ఏం కొంప మునిగిందో అని ఘుర్కా వచ్చి తలుపు తడ్తాడు.' లైటార్పేసి బెడ్డుమీద నడుం వాల్చింది. 'వేళ మించిపోయిందేమో యిక నిద్ర పట్టేట్టు లేదు. ఈరోజు తనకేం అయింది. ఇలా పిచ్చిగా ఆలోచిస్తూంది.' మనసును మళ్ళించటాన్కి ఈ మధ్య తను చూసిన సినిమాలు గుర్తు చేసుకోవటం మొదలుపెట్టింది. 'సెవెన్ స్లైవ్స్ సెవెన్' బ్రహ్మాండం అయిన సస్పెన్స్ థ్రిల్లర్ అంటున్నారు. ఈ ఆదివారం లలితతో ప్రోగ్రాం వేయాలి — ఏమిటో ఈమధ్య బ్రతుకులో థ్రిల్ అన్నది బొత్తిగా లేకుండా పోయింది. మూసలో పోతపోసినట్లు ప్రతిరోజూ ఒకేలా వుంటోంది.. అంతా మొనాటనీ .. బోర్...యిను చికాకేస్తుంది పోని ఎదైనా ఏక్సిడెంటయి బాగా దెబ్బలు తగిలేతే...?...కనీసం టైఫాయిడ్ ఏదో వచ్చి కొన్నాళ్ళ మంచం ఎక్కితే?... నొప్పి ... బాధ ... చావు బ్రతుకుల మధ్య నిరాశ ... ఆశ ... భయం ... అనుమానం

### జ్ఞాపకం ఉంచుకోండి!

ఎప్పుడూ వాడని బట్టల ముక్క వాసన రాకుండా ఉండాలంటే నాలుగు నాఫ్తలిన్ ఉండలూ నాలుగు లవంగాలూ ఓ పల్చని గుడ్డలో చుట్టి బట్టల మధ్యన పెట్టాలి.

ఫ్లాస్కు వాడనప్పుడు కార్కు మూసి పెట్టకూడదు.

వంటింట్లో కత్తి తుప్పుపడితే ఉల్లిపాయలో గుచ్చి ఉంచి ఒట్టలో తుడవాలి. కొంచెం గ్లిజరిన్ రాసి ఉంచినా సరే.

కూరముక్కలు వేయించేముందు బాగా కాగిన నూనె చేతిమీద కంటా తూలకుండా ఉండాలంటే చిన్నరొట్టెముక్క వేస్తే సరి.

నూరి జిడ్డుగావున్న గిన్నెల తోమేముందు న్యూస్‌పేపరుతో తుడిచేస్తే — త్వరగా జిడ్డు తోమేయవచ్చు.


కేబేజీ, కాలిఫ్లవరూ ఉడికేటప్పుడు వాసన తగ్గించాలంటే— ఉడికే నీళ్ళలో ఓ రొట్టె ముక్క వడేస్తే సరి

సన్నరవ కొంచెం దోరగా వేయించి డబ్బాలో పోస్తే పెంకిపురుగు పట్టదు.

వేడివేవైనా గాజు గ్లాసుల్లో పోసేటప్పుడు పగులువేయకుండా ఓ స్పూను వడేయాలి ముందు.

—కె. రా

మందులూ—మాకులూ...ఓహ్ కావల్సినంత థ్రిల్... అమ్మా నాన్నగారూ రెక్కలు కట్టుకు వచ్చేస్తారు. ...ప్చ్ — ఈ అయిడియా బాగాలేదు. వా థ్రిల్ కాదుగాని వాళ్ళకి బాధ...వ్రరీ' మనసులోనే తెంపలు వేసుకుంది శారద. 'ఈరోజు పని హడావిడిలో వీక్లీ తెచ్చుకోవటం మర్చిపోయింది. ఈ మధ్య వీక్లీ కొనటాన్కి వెళ్ళినపుడల్లా ఆ షాపులో చిత్రవిచిత్రం అయిన అడ్వర్టైజ్మెంట్లతో పొందిగ్గా పేర్చిన రకరకాల సిగరెట్ పేకెట్లవైపు అప్రయత్నంగానే తన దృష్టి మళ్ళుతూంది...పోనీ ఒకసారి కాల్చిచూస్తే...యింతకీ మన సంస్కృతిలో ఆడవాళ్ళకి దీన్ని ఎందుకు నిషేధించేరుటా? ... కూడదన్నది చేయటం ఒక ఫేషన్ — బహుశ అందులోనే థ్రిల్ వుందేమో. ఈ థ్రిల్‌కోసమే కదా ఎంతో మంది వ్యసనాలకి దాసులయేది. ఈమధ్య ఎక్కడో చదివింది హాశిష్, మార్జువానా, హిరాయిన్‌లాంటి మందులమత్తుకు అలవాటుపడిన కొందరు అమెరికన్ యువకుల్ని మీరెందుకు వీటికి అలవాటు పడ్డారని ఒక విలేఖరి అడుగుతే 'ఒకసారి రుచి చూడండి మీకే తెలుస్తుంది ఆ థ్రిల్ ఏమిటో' అన్నారట. ఎలా వుంటుందో మరి. తనూ ఈ థ్రిల్ మోహంలోపడి సిగరెట్లు తాగటం ... ఆపైన నిజంగా తాగటం మొదలుపెడ్తే ఎలా వుంటుందట? అయినా యిక్కడి సొసైటీలో అదేం అపరాధం కాదుగ...పైపెచ్చు వీటిని ఇక్కడి సొఫిస్టికేటెడ్ లేడీస్ విశాలభావాలకు చిహ్నలుగ కూడా భావిస్తారు. తమ 'ఇన్నొసెంట్ చైల్డ్' వాటం చూసి నాన్నగార్కి హార్ట్ ఫెయిలయినంత పనౌతుంది. 'ఫ్రెండు ఫ్రెండంటూ మురిసిపోతావుగదూ...చూడు ఆవిడగారి నిర్వాకం' అని రంజనని సాధించి మనసారా సంతోషిస్తాడేమో వాళ్ళాయన. ఓహ్...ఎంత భయంకరంగా ఆలోచిస్తూంది తాను ... మైగాడ్ సేవ్ మి!'... 'రేపు కంగ్రాట్స్‌చెప్తూ రంజనకు లెటరు వ్రాయాలి. ఒకసారి ఏదో మాటల సందర్భంలో బోరుకొడ్తూంది అని తను రాస్తే... 'పెళ్ళి చేసుకోవోయ్ బోలెడంత థ్రిల్' అంటూ సలహా పారేసింది. శాశ్వతంగా అందులో అడుగుపెట్టేముందు మెంటల్‌గా ప్రిపేరయి క్రొత్త జీవితానికి అనుకూలంగా ఎడ్జస్టవటానికి ప్రయత్నించింది. కాని మనస్సునూ ... వ్యక్తిత్వాన్ని ఆ క్రొత్త జీవితానికి అనుకూలంగా మార్చుకోలేదేమో తను అనిపిస్తుంది. ఒకరినొకరు అర్థంచేసుకుని సర్దుకుపోవటం సహజీవనానికి ముఖ్యం అంటారు. తన వ్యక్తిత్వానికి భంగం రానంతవరకు తనూ సర్దుకుపోతుందిగాని...తనని ఎక్స్‌ప్లాయిట్ చేస్తేమాత్రం సహించలేదు. సహజంగానే కాస్త అహంపాలు ఎక్కువగావుండే పురుషుడు తన భార్య అహాన్ని సహజంగా, తేలిగ్గా తీసుకోగలడా? 'తప్పులు చేయటం భర్తలకు చెల్లుతుంది... అధికారం వాళ్ళ జన్మహక్కనుకునే, భార్యలకుండాల్సిన అమాయకత్వం తనలో నశించిపోయిందేమో. వ్యక్తిత్వంలోనూ, మానసిక వికాసంలోనూ భార్యాభర్తలిద్దరూ సమానస్థాయి నందుకున్నపుడు తర్క—వితర్కాలు, విమర్శలు—విరుపులు తప్పవేమో. ఆత్మాభిమానం ఆత్మసమర్పణకు అడ్డురాదని గేరంటీ ఎక్కడుంది? వివాహం అంటె తనకు కొన్ని నిశ్చిత అభిప్రాయాలూ, ఆశయాలూ వున్నయ్. బహుశ తన వ్యక్తిత్వం వాటిని అందుకోలేదేమో. పరిపూర్ణతకు ప్రతిరూపంగా తాను భావించే ఈ బంధం తన జీవితంలోనే సమస్యగామారి అసంతృప్తికి కారణం అయితే భరించగలదా? ... ఏవేవో భయాలు ... ఎన్నెన్నో సందేహాలు. ప్రతివిషయాన్నీ చాలా కేజువల్‌గా తేలిగ్గా తీసుకునే తనకు ఈ పిరికితనం ఎక్కడనుండి వచ్చింది? అతిగా ఆలోచించటం వల్లేమో. ఇంత విమర్శనాత్మకంగా తరచి చూసే తను అందులోని ఆనందాన్ని అనుభవించలేదేమో? 'సెనల్సూ పెటల్సూ! వినాటమీ అంటూ చక్కటి పువ్వుల




"త్వరలో 'ఏ' సర్టిఫికేటు సినిమాలలో ముద్దులు చూపిస్తారట, అంటే ఇప్పటి 'యు' సర్టిఫికేట సినిమాలన్నీ చిన్నపిల్లలకి తగినవేననా అర్థం ?"

అంధాన్ని పాడుచేస్తున్నారోయ్ మీరు' అంటూ రంజనని వేళాకోళం చేసేది తను. బహుశ పత్యాల్ని కనుక్కోవటానికి తనూ జీవితాన్ని డిసెక్ట్ చేసి దాని అందాల్ని గమనించలేకపోతుందేమో. క్రొత్త జీవితంలో ఇమిడిపోవటానికి పాతబంధాల్ని తెంచుకుని వాటిని అతీతంలోకి నెట్టేసి ఎక్కడో గుండెల లోతుల్లో జ్ఞాపకాలుగా మాత్రం అట్టే పెట్టక తప్పదని ఆరోజు రమేష్ ప్రవర్తన చూసేక స్పష్టంగా అర్థం అయింది. తన మనసునూ, వ్యక్తిత్వాన్ని యింతగా తీర్చిదిద్దిన ఈ బంధాల్ని తాను తెంచుకోగలదా? ఇన్నాళ్ళూ తన ఊహల్లో, ఆలోచనల్లో, ఆశయాల్లో అనునిత్యం కదలాడే ఈ వ్యక్తుల్ని ఒక్కసారిగా తీసి అవతల పెట్టేయగలుగుతుందా? రంజన... తన రంజనను స్మృతుల్లోకి నెట్టేయగలుగుతుందా?' ఈ ఆలోచనలు తనకే అస్తవ్యస్తంగా, అర్థం లేనివిగా అనిపించేయి శారదకు. 'తానూ ఎంత విచిత్రం అయిన మనిషి... భూమిగుండ్రంగా వుందన్నట్లు రాజాతో మొదలయిన ఆలోచనలు తిరిగి అక్కడికే వచ్చేయి. మనసును అల్లకల్లోలం చేసి తనని అస్తవ్యస్తం చేసిన ఈ ఆలోచనా స్రవంతి బయలుదేరిన చోటికే

# మైక్రోస్కోప్

వచ్చి ఆగింది. కళ్ళెంలేని గుర్రంలా పరిగెట్టిన తన మనసు తెగిపోతువ్నా యేమోనని భయపడిన ఆ బంధాల దగ్గరకే వెతుక్కుంటూ తిరిగి వచ్చింది. 'జీవితం పెద్ద విద్యాభ్యాసం' అని ఏ మహానుభావుడన్నాడో గాని నోబుల్ ప్రైజు యివ్వచ్చు. ఎంత భయపడినా...ఏం ఆశించినా జీవితం మాత్రం తన దారిన తాను వెళ్ళక మానదు. భయపెడ్తూనే ఆనందం అందివ్వటం, ఆనందంలో కూడా కాస్త చేదును రుచిచూపటం దీనికి అలవాటేమో. బహుశ ఆలోచనలు, భయాలు కూడా ఇలాటి విరోధాభాసాలేనేమో' ఎందుకో ఈ ఆలోచన బాగుందనిపించింది శారదకు...'ఐనా ఎప్పుడో ఒకప్పుడు వర్తమానంలో నిలబడి గతాన్ని, భవిష్యత్తుని తూచి చూసి ప్లస్ మైనస్‌ల బేరీజు వేసుకోక తప్పదేమో... తానేం సాధించాలనుకుంది? ఏం సాధించింది? ముందు ముందు ఏం సాధించబోతూంది??? ఏమో...తనకే తెలియదు. తృప్తి పడటాన్కి జీవితంలో సాధించిందీ లేదు ... అసంతృప్తిగా ఉందనుకోవటాన్కి కారణమూ లేదు ... అయినా ముందూ వెనుకా పెద్ద ప్రశ్న వాచకాలు... జవాబు వెతుక్కోవటాన్కి అసలు ప్రశ్న ఏమిటో అర్థం అయితే కదా! బహుశ జీవితం గురించి ఆలోచించి ఆత్మ పరిశీలన చేసుకునే అందరికీ జవాబుగా లభించేవి ఆ అయోమయం అయిన ప్రశ్నలేనేమో... 'ఏమిటి...ఎందుకు అన్న ప్రశ్నల జోలికి పోకుండా నీ పనేదో నువ్వు చేసుకుపోతూండు...చేయటం వరకే నీ వంతు... చేయించేవాడిని నేను' అని అందుకేనేమో భగవానుడు హెచ్చరించింది......అరే! తను ఫిలాసఫీకూడా వల్లె వేస్తూందే...బహుశ తర్కానికీ బుద్ధికి కొరుకుడు పడని ప్రశ్నలకు, సమస్యలకూ సమాధానం అందులోనే లభిస్తుందేమో...అయినా అసలు తనకు సమస్యలంటూ ఏం వున్నాయని మహా...' మనసుకు నచ్చచెప్పుకోబోయిన శారద యిక ఆపై ఆలోచించదల్చుకోలేదు. మనసుకూ, బుద్ధికీ గట్టిగా పగ్గాలు బిగించేసి బలవంతంగా కళ్ళు మూసుకుంది.

రాత్రి కలలో రంగురంగుల పూలమధ్య కూర్చుని రెక్కలు తీస్తూ మైక్రోస్కోపు క్రింద టెస్టు చేస్తున్న శారదను లెన్స్ అడ్జస్టు చేస్తున్నకొలది పెద్ద వవుతూ వికటాట్టహాసం చేస్తున్న ప్రశ్న మార్కులు భయపెడుతూనే వున్నయ్. ●

